క్లుప్తంగా

రేపటి నుంచి స్వాములకు నిత్య అన్నదానం

- ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

చీమకుర్తి: సర్వమాలలు ధరించిన స్వాములం దరికీ ఈ నెల 16 నుంచి చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో నిత్య అన్నదానం చేస్తున్నట్లు బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ తరపున వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి తెలిపారు. స్వామి మాలలను ధరించిన భక్తులకు తమ దీక్షలు పూర్తయ్యే వరకూ అన్నదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అన్నదానం ప్రారంభం రోజు చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో అయ్యప్పస్వామి పడిభజన కార్యక్రమం జయప్రదం చేయాలని స్వామి మాలలు ధరించిన భక్తులందరికీ ఎమ్మెల్యే బూచేపల్లి విజ్ఞప్తి చేశారు.

వెల్లువెత్తిన సంచార కులాలు

ఒంగోలు వన్‌టౌన్: స్థానిక ప్రగతి భవన్‌లోని బీసీ కార్యాలయానికి బీసీ సంచార కులాల ప్రజలు గురువారం ఉదయం వెల్లువెత్తారు. వారిని లెక్కించి, అనంతరం వారి జీవనానికి రుణాలు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో సచివాలయాల్లో నమోదు చేసుకోవడానికి కొంత మందికి విఫలం అవడంతో కొత్తపట్నం మండలం తదితర ప్రాంతాల నుంచి సంచార కులాల ప్రజలు భారీ సంఖ్యలో బీసీ కార్యాలయానికి చేరుకున్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ఒంగోలు టౌన్: మైనంపాడుకు చెందిన అద్దంకి అనిల్‌పై కులంపేరుతో దూషిస్తూ భౌతికదాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రఘురాం డిమాండ్ చేశారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అనిల్‌ను గురువారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షేక్ మౌలాలి, షేక్ ఖయ్యూమ్ అనే ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడుతుండగా అటుగా వెళుతున్న అనిల్ ఎందుకు కొట్టుకుంటున్నారని వారించాడని, దాంతో వారు చేతిలో ఉన్న కడియంతో పాటు.. పక్కనే వున్న ఇటుకరాయితో రక్తం వచ్చేలా కొట్టి, కులంపేరుతో దూషించారని తెలిపారు. మౌలాలీ, ఖయూమ్‌లపై ఇప్పటికే అనేక కేసులున్నాయని, దాడులు చేయడం, రాజీలు చేయడం వారికి పరిపాటిగా మారిందని తెలిపారు. కౌంటర్ కేసులు పెట్టకుండా వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

ఆయుర్వేదంతో ప్రాణాలు పదిలం

ఒంగోలు టౌన్: నగరంలోని ఆత్రేయ ఆయుర్వేద ఆసుపత్రిలో కార్తీక బహుళ త్రయోదశిని పురస్కరించుకొని ధన్వంతరి జయంతిని నిర్వహించారు. ఆయుర్వేద వైద్యులు సుదర్శన చక్రవర్తి మాట్లాడుతూ ధన్వంతరి జయంతిని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. దేశీయ వైద్య చికిత్సలను వినియోగించుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా.. ఆనందంగా జీవిస్తారని చెప్పారు. . డాక్టర్ కేఎస్ఎస్ చక్రవర్తి, వినియోగదారుల సంఘం కార్యదర్శి ఏనుగుల సురేష్ బాబు, కోటేశ్వరరావు, వి. నందకుమార్ పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు అంబేడ్కర్ నగర్‌కు చెందిన నలతోటి రవికుమార్ పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్ కుమార్ గ్రామంలోని ఆ కుటుంబాన్ని పరామర్శించారు. వారితో మాట్లాడి వారి సమస్యలు, జరిగిన ప్రమాదాన్ని అడిగి తెలుసుకున్నారు. కాలిపోయిన ఇల్లుని, గాయపడిన గేదెలను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పశువులకు వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. తన వంతుగా కొంత ఆర్థిక సాయం చేసి ప్రభుత్వం తరపున న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. చైర్మన్‌తో పాటు నాయకులు తెలగతోటి జాన్సన్, వాసుమల్లి నాగార్జున, తెలగతోటి పృధ్వి, స్టాలిన్, యాదల నాగరాజు, ఏసోబు, ఐజక్, నగేష్, ఆంజనేయులు ఉన్నారు.

ప్లాస్టిక్‌తో క్యాన్సర్ ముప్పు

మద్దిపాడు: మండలంలోని మల్లవరం, ఏడుగుండ్లపాడు వెల్‌నెస్ సెంటర్‌లను డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ సురేష్‌కుమార్ గురువారం సదర్శించారు. ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ కవర్ల ద్వారా ఆహార పదార్థాలు తెచ్చుకుంటే క్యాన్సర్ వ్యాధిని మన ఒంట్లోకి తీసుకొస్తున్నట్టేనన్నారు. ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ భగీరథి, పీహెచ్‌సీ డాక్టర్ ఆనందమోహన్ సీహెచ్‌ఓలు లలితమ్మ, రజిత, సూపర్‌వైజర్ బాలకోటయ్య, మెడికల్ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'బంగారు బాల్యం'తో భరోసా

ఒంగోలు టౌన్: తమీమ్ అన్సారియా ఆలోచనల నుంచి పుట్టిన బంగారు బాల్యం పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతుందని జీజీహెచ్ సూపరెంటెండెంట్ డా. జమున అన్నారు. వైద్యం ద్వారా చిన్నారులకు బంగారు బాల్యాన్ని అందజేయాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జీజీహెచ్ ప్రాంగణంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, వైద్య, నర్సింగ్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ నెల 16న బంగారు బాల్యం థీంపై నర్సింగ్ విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

మురుగు నగరం



భాగ్యనగర్ మొదటి లైన్‌లో మురుగు పోయే వీలులేక కాలువలోనే నిలిచిన మురుగు



భాగ్యనగర్ రెండో లైన్‌లో పాత ఆర్టీఓ కార్యాలయం ముందు



భాగ్యనగర్ రెండో లైన్ ఎంట్రన్స్‌లో బ్యాంకు ముందు రోడ్డు పై ఇలా..



ట్రంక్ రోడ్డుపై ఉన్న మురుగు

ఒంగోలు సబర్బన్: నగరంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఒక పక్క పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న మేస్త్రీలను రాజకీయ కక్ష సాధింపులో భాగంగా విధుల నుంచి కనీస సమాచారం లేకుండా తొలగించారు. దీంతో ఒంగోలు నగరంలోని పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. చినుకు పడితే కాలువల్లోని మురుగు మొత్తం రోడ్ల మీద తాండవిస్తోంది. నగరంలోని ప్రధాన కాలువల్లోని మురుగు తీయకుండా నిర్లక్ష్యం చేయటం వల్లనే కాలువల్లో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. మురుగు సక్రమంగా వెళ్ళే వీలులేక కాలువలు నిండిపోతున్నాయి. వర్షం పడితే చాలు ఆ కాలువల్లోని మురుగు మొత్తం రోడ్ల మీదకు వచ్చి చేరుతోంది. ప్రధానంగా ప్రధాన కాలువల్లోని మురుగును విస్మరించటమే అందుకు కారణమని స్పష్టం అవుతోంది. నగరంలో చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయమవుతున్నాయి. ఒంగోలు నగరంలోని దక్షిణ బైపాస్ నుంచి డిమార్ట్, జీజీహెచ్ వైద్యశాల, రామ్ నగర్ తొమ్మిదో లైన్ నుంచి ఐదో లైన్ వరకు వర్షం పడిందంటే చాలు మోకాటి లోతు నీళ్ళు నిలబడాల్సిందే. ఇక భాగ్యనగర్ నాలుగో లైన్ పరిస్థితి మరీ అధ్వానం. నాలుగో లైన్ ప్రారంభం నాలుగో తరగతి ఉద్యోగుల భవనం మొదలుకొని భాగ్యనగర్ ఐదో క్రాస్ రోడ్డు వరకూ ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోతున్నారు. నిత్యం మంచినీటి పైపులైన్ల లీకుల కారణంగా గుంటలు తవ్వటమే పనిగా పెట్టుకుంటున్న నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు శాశ్వత పరిష్కారం మాత్రం చూపటంలేదు. తిరిగి కేఎంఎస్ స్కూలు పరిసరాల్లోనూ భాగ్యనగర్ నాలుగోలైన్ దుస్థితిని వర్ణించనలవికాదు అంటే అతిశయోక్తి కాదు. ఇక భాగ్యనగర్ ఒకటో లైన్‌నుంచి మూడో లైన్ వరకు కూడా రోడ్లమీదనే మురుగు చేరటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే ఒంగోలు నగర ప్రజల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఒంగోలు నగరం నిడిబొడ్డు మస్తాన్ దర్గావద్ద అయితే వర్షం పడితే ఆ ప్రాంతం మొత్తం ఒక చెరువును తలపిస్తోంది. వాహనాల రాకపోకలకు కూడా చాలా ఇబ్బందిగా మారుతోంది. బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ముందుకూడా అదే పరిస్థితి. ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలోని ట్రంక్ రోడ్డులో పరిస్థితి కూడా దీనంగా మారుతోంది. కర్నూలు రోడ్డు ఫ్లై ఓవర్ పరిసరాల్లో కూడా ఎక్కడ నీళ్ళు అక్కడే రోడ్ల మీదనే వర్షం వెలిసిన గంటల తరబడి నీళ్ళు నిలిచిపోతున్నాయి. కర్నూలు రోడ్డు ఫ్లై ఓవర్ నుంచి రోడ్డుకు తూర్పు వైపున ఉత్తర బైపాస్ వరకు వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. వీటన్నింటికీ ప్రధాన కారణం నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్థవ్యస్థంగా మారటమే. నగర పాలక సంస్థ అధికారులు మాస్టర్‌ప్లాన్ ప్రకారం డ్రైనేజీ వ్యవస్థను మార్చకపోతే నగర ప్రజలు ఇబ్బందులు పడక తప్పదు.

పెత్తనమంతా అధికారులదేనా?

- సమాచారం తెలియకుండానే పథకాలు అమలు చేస్తారా?
- ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: పాలకులు, ప్రజలు నిర్ణయాల ప్రకారం అధికారులు తీర్మానాలు తీసుకోవాలని.. అలా కాకుండా పాలకులు, ప్రజల పాత్ర కూడా అధికారులు పోషిస్తూ నిర్ణయాలు తీసుకోవడం వలన పెద్ద ఎత్తున సమస్యలు సృష్టిస్తున్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. మండల తీర్మానాల్లో సంతకాలు పెట్టకపోతే అధికారులే బెదిరిస్తున్నారు. ఎంపీటీసీలకు, సర్పంచ్‌లకు, జెడ్పీటీసీలకు పథకాలు గురించి తెలియజేయండి అని ఎన్నిసార్లు చెప్పినా పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ రాజ్ శాఖ నుంచి 2024–25 పంచాయతీ అభివృద్ధి పనులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పథకాల గురించి ఎంపీటీసీ, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, కోఆప్షన్ మెంబర్, ఎంపీపీలకు తెలియజేయాలని కోరారు. ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో 81 మందికి గోకులం పథకం ద్వారా గేదెలకు, గొర్రెలకు షెడ్‌లు కోసం ఎవ్వరికీ తెలియకుండా అధికారులు లిస్టు తయారి చేసి సంతకాలు కావాలని నా ఇంటికి వస్తే ఎలా కుదురుతుందని ప్రశ్నించారు. 81 మంది లబ్ధిదారులకు తీర్మానంలో సంతకం పెట్టకపోతే నా చెరువుల దగ్గరకు వచ్చి విద్యుత్ అధికారులు రాత్రిపూట విద్యుత్‌ను కట్ చేస్తామని వచ్చి బెదించడం ఎంతవరకు న్యాయమని మండిపడ్డారు. ఒక ఎంపీపీనే ఈ విధంగా చేస్తుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరు, పాదర్తి ఇరిగేషన్ చెరువులకు అధ్యక్షుల ఎన్నికలు తమకు తెలియకుండా ఎలా జరుపుతారని పంచాయతీ కార్యదర్శులు అల్లయ్య, విజయలక్ష్మిలను ప్రశ్నించారు. ఓటర్ల లిస్టు కూడా బహిర్గతం కాలేదన్నారు. గత ఐదు సంవత్సరాల్లో ఒక్క వీవోఏలను మార్చలేదని గుర్తు చేశారు. కొత్తపట్నం ఎంపీటీసీ సభ్యుడు రామలింగం వెంకట్రావు మాట్లాడుతూ మండల పరిషత్ తీర్మానాలకు రొయ్యల చెరువుల విద్యుత్ కట్ చేయాలని అధికారులు వెళ్లడం సరైన విధానం కాదని ఖండించారు. ఎంపీడీవో శ్రీకృష్ణ మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధి చెందటానికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈవోఆర్డీ వేణుగోపాల్‌మూర్తి, ఎంపీటీసీలు ఆళ్ళ రవీంద్ర రెడ్డి, శాంతారావు, పంచాయతీ కార్యదర్శిలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పశువైద్యాధికారి అనూష, డాక్టర్ శివపార్వతి, ఉప్పుటూరి కోటేశ్వరరావు, కోఆప్షన్ మెంబర్ బాజీ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

నాగులుప్పలపాడు: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని గ్రామీణాభివృద్ధి రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ రామనాథం పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణాభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రామనాథం మాట్లాడుతూ పంచాయతీలకు వచ్చే నిధుల ఆధారంగా ప్రాధాన్యం ప్రకారం నిర్దేశించుకొని సర్పంచ్‌లు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రణాళికలు సిద్ధం చేసుకొని గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టాలన్నారు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం బంగారు బాల్యంతోనే మహోన్నత ప్రపంచం సాధ్యమవుతుందని నమ్ముతూ అందుకు తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛ భారత్‌పై ర్యాలీ నిర్వహించారు. బాపట్ల విస్తరణ శిక్షణాధికారి డి. వెంకటేశ్వర్లు, ఎంపీపీ నలమలపు అంజమ్మ, ఎంపీడీఓ వై.మహాలక్ష్మి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నెహ్రూ జీవితం స్ఫూర్తిదాయకం



చీమకుర్తి: ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్, కమిషనర్



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఒంగోలు సిటీ: జవహర్‌లాల్ నెహ్రూ జీవితం బాలలకు అంకితం అని, ప్రధాని పదవిలో ఉండి కూడా బాలల కోసం ఆయన చూపించిన శ్రద్ధ మరవరానిదని లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు విజన్ అధ్యక్షుడు టీవీఎస్ శర్మ అన్నారు. గురువారం గద్దలగుంటలోని పింగళి కోదండరామయ్య ఓరియంటల్ స్కూల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా లయన్ మారుతి, లయన్ ఎస్. వెంకటేశ్వర్లు, లయన్ ఏ.వంశీకృష్ణ, ప్రసగించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి.. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ట్రెజరర్ ఎస్. సురేష్, పీఈటీ సోమినేని సురేష్, సంస్కృత ఉపాధ్యాయులు ఆనంద్ పాల్గొన్నారు.

చీమకుర్తి: బాలల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు తహసీల్దార్ బ్రహ్మయ్య, కమిషనర్ రామకృష్ణయ్య తెలిపారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొట్టమొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నిర్వహించే బాలల దినోత్సవం బాలల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసే విధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించే వారోత్సవాల్లో బాలల హక్కులు, రక్షణ, భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దటంలో అవగాహన కలిగించేందుకు రోజుకొక కార్యక్రమంపై విద్యార్థులకు వివరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బాలలతో ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓలు శివాజీ, నరసింహారావు, హెచ్ఎం వీరాస్వామి, మెప్మా సిబ్బంది, స్థానిక టీచర్‌లు పాల్గొన్నారు.

చీమకుర్తి రూరల్: మండలంలోని ఆర్ఎల్‌పురం పరిధిలో అంగన్‌వాడీ కేంద్రంలో బాలల దినోత్సవం సందర్భంగా భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పమిడి సురేష్ అంగన్‌వాడీ కేంద్రానికి 20 కుర్చీలు, 2 ఫ్యాన్లు బహూకరించారు. పమిడి రంగయ్య, జెమిని, విజయకుమార్, అంగన్‌వాడీ సిబ్బంది మాదాల రాధ, ఎం.విజయ పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: బాలల హక్కుల కోసం అందరం పాటుపడాలని ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగులుప్పలపాడు శాఖ గ్రంథాలయంలో మొదటి రోజు కార్యక్రమాల్లో భాగంగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రంథపాలకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు వారం రోజులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు స్వీట్స్ అందించారు.

మద్దిపాడు: బాలలను పరిరక్షించుకుందామని తహసీల్దార్ సుజన్ కుమార్ అన్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను పోగొట్టేందుకు ప్రభుత్వం ఉచిత నిర్బంధ విద్యను ప్రవేశ పెట్టిందన్నారు. బాలికలకు చిన్నతనంలోనే వివాహం చేయడం, లైంగిక వేధింపులకు గురిచేయడం నేరమన్నారు. ప్రజలు అందరూ సంఘటితంగా ఉంటూ బాలలను పరిరక్షించుకుంటేనే భవిష్యత్‌లో ఉన్నత స్థాయి సమాజం ఏర్పడేందుకు వీలుంటుందని చెప్పారు. ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఒంగోలు సిటీ: ఒంగోలు మండల పరిధిలోని కరవది గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ లో బాలల దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఈఓ పి.బాలమ్మ పాల్గొని జవహర్‌లాల్ నెహ్రు చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు ఎంపీడీఓ శేషుబాబు, ఎంఈఓ–2 పి.సరస్వతి, హెచ్ఎం పీవీఎస్ రవికుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



సంతనూతలపాడు: మాట్లాడుతున్న ఎంఈఓ వెంకారెడ్డి

సంతనూతలపాడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను బాలల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా ప్రారంభించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా ఎంఈఓ డి.వెంకారెడ్డి పాల్గొన్నారు. తొలుత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. పోటీలకు ఎస్.ఉమామహేశ్వరి, టి.సుబ్బారావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. 40 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. హెచ్ఎం ఎం. ప్రమోద, ఎస్.ఉమామహేశ్వరి, స్థానిక గ్రంథపాలకులు కె.సత్యనారాయణ, జి.బేంజిమన్, మాధవీలత, విజయలక్ష్మి పాల్గొన్నారు. మండలంలోని రుద్రవరంలో కూడా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి పూర్వ గ్రంథ పాలకుడు కె.రమణారెడ్డి, ప్రస్తుత గ్రంథ పాలకుడు బి.శేఖర్ హాజరయ్యారు.

మద్దిపాడు: మండల పరిధిలోని ఏడుగుండ్లపాడు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభించినట్లు లైబ్రేరియన్ రోహిణి తెలిపారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా భారత మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి సర్పంచ్ శిల్పసౌందర్య పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ క్రమంలో విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, భార్గవ్, విద్యార్థులు పాల్గొన్నారు.



మద్దిపాడు: మాట్లాడుతున్న లైబ్రేరియన్ రోహిణితో సర్పంచ్

మైథిలి మరణానికి కారకులను శిక్షించాలి

ఒంగోలు టౌన్: అండర్ –17 క్రీడాకారిణి నన్నేబోయిన మైథిలి మరణానికి కారకులను కఠినంగా శిక్షించాలని కోరుతూ పొన్నలూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన నన్నేబోయిన వేణుగోపాల్ గురువారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కూతురు పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ స్టేట్ లెవల్ మీట్‌కు స్కూల తరపున ఆడేందుకు సెప్టెంబర్ 27న వెళ్లిందని అయితే 30వ తేదీన తెలవారుజామున నెల్లూరు నుంచి ఫోన్ వచ్చిందని తెలిపారు. అక్కడకు వెళ్లి చూడగా మైథిలి మరణించి ఉందని తెలిపారు. వినుకొండ నుంచి అర్ధరాత్రి ఒంగోలుకు వచ్చిన తన కూతురిని ఎలాంటి విచారణ చేయకుండానే చెరుకూరు గ్రామానికి చెందిన కుంచాల కృపాకర్‌తో పంపించారని, ఈ విషయంలో స్పోర్ట్స్ సెక్రటరీ కోటు వనజ, పీఈటీ బిన్ని నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. మైనర్ అయిన తమ కూతురు మైథిలికి కృపాకర్ మాయమాటలు చెప్పి, ట్రాప్ చేసి పథకం ప్రకారమే రూటు మార్చి నెల్లూరు తీసుకెళ్లాడని తెలిపారు. ఈ ముగ్గురిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

మద్దిపాడు: ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని గృహ నిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని గుండ్లాపల్లి, ఏడుగుండ్లపాడు లేఔట్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం లబ్ధిదారులు గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు పొంది వాటిలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద వారంతా రిజిస్టర్ అయ్యారని తెలిపారు. ఆ పథకం 2024 డిసెంబర్ నాటికి ముగిసి పోతుందని, అసంపూర్తిగా నిర్మాణాలు చేసిన వారు వెంటనే మొదలు పెట్టి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. ఆ తర్వాత డబ్బులు రాలేదని కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదని ఆయన లబ్ధిదారులకు తెలిపారు. మరికొందరు కొత్త ప్రభుత్వంలో ఎక్కువ మొత్తంలో ఇళ్ల నిర్మాణాలకు డబ్బు ఇస్తారని ఎదురు చూస్తున్నారని, గతంలో రిజిస్టర్ అయిన వారికి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపిన పథకం వర్తించదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇళ్ల నిర్మాణాలు డిసెంబర్ నెల చివరికి పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు పీడీ సూచించారు. అనంతరం ఆయన గృహనిర్మాణ సంస్థ గోడౌన్‌ను పరిశీలించారు. ఆయన వెంట డీఈ చెన్నారాయుడు, ఏఈ హేమలత, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

19న నాయీబ్రాహ్మణ కార్తీక సమారాధన

ఒంగోలు సిటీ: పట్టణ క్షౌ రశాలల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 19న యరజర్ల–కందులూరు మధ్యన ఉన్న వీఆర్ఎస్‌కే గ్రీన్‌సిటీలో జరుగుతున్న నాయిబ్రాహ్మణ కార్తీకమాస వన సమారాధన మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఒంగోలు పట్టణ క్షౌ రశాల సంఘ అధ్యక్షుడు, ప్రధాన క్యాదర్శి కొణిజేటి రామకృష్ణ, ఏల్చూరి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే మాటతో 16 మందికి అన్యాయం

ఒంగోలు టౌన్: ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నోటిమాటతో పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న 16 మందిని ఉద్యోగాల నుంచి తొలగించారని సీఐటీయూ నగర కార్యదర్శి టి. మహేష్ తెలిపారు. వీరంతా నగరంలో దాదాపుగా 15 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, రాష్ట్రంలో తెలుగు దేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అనేక మంది చిరుద్యోగుల కడుపులు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. 12 రోజులుగా మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం దీక్షా శిబిరాన్ని సందర్శించిన రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావుకి నగర కమిటీ తరపున వినతిపత్రం అందజేశారు.

అధిక ధరలు తగ్గించాలంటూ సీపీఎం నిరసన



నాగులుప్పలపాడు ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

సంతనూతలపాడు: అధిక ధరలు తగ్గించాలని, ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక బస్టాండ్ సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, మహిళలు, పిల్లలపై అత్యాచారాలను అరికట్టాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. వెలుగొండ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, దళిత, గిరిజనులపై దాడులను అరికట్టాలని ఆయన కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బంకా సుబ్బారావు, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని రక్షించాలని కోరారు. నాయకులు షేక్ మస్తాన్, కరిచేటి హనుమంతరావు, ఎం.సుబ్రహ్మణ్యం, ఎన్‌వీ నరసింహారావు, కె.రామకృష్ణారెడ్డి, టి.సుబ్బారావు, టి.ప్రభుదాసు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో 8 నుంచి 15 వరకు చేపట్టిన ప్రజాపోరులో భాగంగా నాయకులు ఇంటింటికీ తిరికి కరపత్రాలు పంపిణీ చేసి సమస్యలు తెలుసుకున్నారు. ఆ సమస్యలు పరిష్కరించాలని గురువారం మండల కేంద్రం నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్లో ధర్నా చేశారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. సీపీఎం నాయకులు జి.బసవ పున్నయ్య, ప్రభుదాస్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రామాంజనేయులు, చిరంజీవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి



సంతనూతలపాడు: మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

సంతనూతలపాడు: అందరి భాగస్వామ్యంతో గ్రామాల్లో పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపీడీఓ డి.సురేష్‌బాబు పేర్కొన్నారు. ఎంపీడీఓ పర్యవేక్షణలో మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచులకు, ఎంపీటీసీలకు, గ్రామ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు గురువారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్రం నుంచి నిధులు మంజూరవుతాయని, ఆ నిధులతో గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, వీధి లైట్లు తదితర సౌకర్యాలకు వాడుకోవచ్చని తెలిపారు. ఏపీఎస్ఐఆర్డీ నుంచి పరిశీలకులు రామనాథం ప్రణాళికలపై తన ప్రసంగంలో వివరించారు. బంగారు బాల్యంపై ఎంపీడీవో సురేష్‌బాబు ప్రతిజ్ఞ చేయించారు. మైనంపాడు కార్యదర్శి పి.రవికుమార్, గుమ్మళంపాడు కార్యదర్శి ఎం. జయశంకర్ రిసోర్సు పర్సన్లుగా వ్యవహరించారు. ఎంపీపీ బి. విజయ, జెడ్పీటీసీ డి.రమణమ్మ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఈఓఆర్డీ రమణమ్మ, పీఆర్ ఏఈ వీరాంజనేయులు, ఏపీఎం బాబూరావు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కొత్తపట్నం: మండలంలో 108 అంబులెన్స్ సర్వీస్‌లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ ప్రభుత్వం వేతనం చెల్లించే జీవో విధానాన్ని అమలు చేయాలని 108 అంబులెన్స్ సర్వీస్ సిబ్బంది గురువారం డిమాండ్ చేశారు. ఈఎంటీ, పైలెట్‌లు మాట్లాడుతూ నవంబర్ 25 నుంచి సమ్మెకు వెళ్తున్నామని తెలియ చేస్తూ గురువారం తహసీల్దార్ మధుసూదన్‌రావు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఎంపీడీవో శ్రీకృష్ణకు వినత పత్రం అందజేశారు. పైలెట్ మేడికొండ థాసుదినేష్, ఈఎంటీలు చిటితోటి స్వర్ణ, కొత్తపల్లి నాగరాజు, పైలెట్ ఎస్. సురేంద్ర పాల్గొన్నారు.

బాల్య వివాహాలు సామాజిక రుగ్మత



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

కొత్తపట్నం: బాల్య వివాహాల రహిత జిల్లాను మార్చాలని పాఠశాల హెచ్ఎం మన్నెం శ్రీదేవి అన్నారు. బంగారు బాల్యం మిషన్ శక్తి వారోత్సవాల్లో భాగంగా గురువారం బంగారు బాల్యానికి శ్రీకారం బాలోత్సవాలు ప్రారంభించారు. తహసీల్దార్ మధుసూధన్‌రావు, ఈవోఆర్డీ వేణుగోపాల్ మూర్తి, స్టాఫ్ సెక్రటరీ హరిబాబు భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా ట్రైనింగ్ కమిషనర్ కొనిజెటి వెంకటశేషారావు, గైడ్స్ కెప్టెన్ పద్మశ్రీ పాల్గొన్నారు.